# దక్షిణాపథ వార్తావని

మార్చి 2026
సంపుటి - 03
సంచిక - 03

సాంప్రదాయకంగా మన దేశంలో వింధ్యకు దక్షిణాన ఉన్న భూమి దక్షిణాపథంగా పరిగణించబడుతుంది. భారతీయ ఏకాత్మత స్ఫూర్తిగా సమాజాన్ని, మారుతున్న కాలాన్ని ప్రతిబింబిస్తూ గొప్ప రాజకీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజలు, స్ఫూర్తిదాయక చిహ్నాలను సంగ్రహించడం, సమీకరించడం దక్షిణాపథం పేరిట నడిపే ఈ బులెటిన్ లక్ష్యం. రాష్ట్రాల పరంగా చూస్తే దక్షిణాపథం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలను సూచిస్తుంది. ప్రస్తుతమున్న మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్ మరియు ఒడిషాలోని కొన్ని ప్రాంతాలు కూడా దక్షిణాపథం క్రిందికే వస్తాయి. ఈ ప్రాంతాల విషయాలు ఈ బులెటిన్ లో ప్రస్తావిస్తున్నాము.

### మహావీర్ జయంతి (మార్చి 31)



ఆధ్యాత్మిక ప్రకాశంతో వెలిగిపోయే జైన సమాజానికి మహావీర్ జయంతి ఒక విశిష్టమైన వేడుక. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, మానవాళికి శాంతి, అహింసల గొప్ప సందేశాన్ని అందించిన వర్ధమాన మహావీరుని జన్మదినాన్ని స్మరించుకునే పవిత్రమైన సందర్భం. మార్చి 31 న దేశవ్యాప్తంగా లక్షలాది మంది జైనులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు. వర్ధమాన మహావీరుడు, జైన మతంలోని 24వ చివరి తీర్థంకరుడు.

సా. శ. పూర్వం 599లో బీహార్‌లోని కుండల గ్రామంలో జన్మించిన ఆయన, తన 30వ ఏట రాజభోగాలను విడిచిపెట్టి సన్యాసం స్వీకరించారు. సుదీర్ఘమైన తపస్సు మరియు ధ్యానం ద్వారా ఆయన జ్ఞానోదయం పొందారు. ఆ తరువాత ఆయన తన జీవితాంతం అహింస, సత్యం (నిజాయితీ), అస్తేయం (దొంగతనం చేయకపోవడం), బ్రహ్మచర్యం (స్వీయ నియంత్రణ), మరియు అపరిగ్రహ (అనాసక్తి) అనే ఐదు సూత్రాల యొక్క ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పారు.

మహావీర్ జయంతి రోజున జైన ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో నిండిపోతాయి. రంగురంగుల తోరణాలు, పూలమాలలతో అలంకరించబడిన ఆలయాలు భక్తులను ఆహ్వానిస్తాయి. ప్రత్యేక ప్రార్థనలు, భజనలు ఇంకా మతపరమైన ప్రవచనాలతో ఆలయాలు మార్మోగుతాయి. మహావీరుని విగ్రహానికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, నీటితో కూడిన పంచామృతాలతో అభిషేకం చేస్తారు.

మహావీర్ జయంతి సందర్భంగా జైన సమాజం అనేక రకాల ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. పేదలకు అన్నదానం చేయడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, విద్యా సంబంధిత కార్యక్రమాలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలు ఈ రోజున ప్రత్యేకంగా చేపడతారు. జైనులు ఉపవాసాలు పాటించి, తమ ఇంద్రియాలను నియంత్రించుకుంటారు. హింసను నివారించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కనీసం చీమలు వంటి చిన్న జీవులకు కూడా హాని కలిగించకుండా జాగ్రత్త వహిస్తారు.

హైదరాబాద్ నగరంలో మహావీర్ జయంతి వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతాయి. నగరంలోని అన్ని ప్రధాన జైన ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబవుతాయి. చార్మినార్, అబిడ్స్, సికింద్రాబాద్ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉదయం శోభాయాత్రలు కన్నుల పండుగగా సాగుతాయి. రంగురంగుల దుస్తులు ధరించిన భక్తులు, మతపరమైన పాటలు పాడుతూ, మహావీరుని యొక్క సందేశాన్ని చాటుతూ ఊరేగింపులో పాల్గొంటారు.

సాయంత్రం జైన ఆలయాలలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ప్రముఖ పండితులు మహావీరుని జీవితం మరియు బోధనల గురించి ప్రవచనాలు చేస్తారు. జైన భజనలు మరియు కీర్తనలు ఆలపిస్తారు.

మహావీరుని యొక్క ప్రధాన బోధనలలో అహింస అత్యంత ముఖ్యమైనది. ఆయన ప్రతి జీవిలోనూ ఆత్మ ఉందని నమ్మారు మరియు ఏ జీవిని హింసించకూడదని బోధించారు. ఆయన కేవలం శారీరక హింసను మాత్రమే కాకుండా, మాటల ద్వారా ఆలోచనల ద్వారా కూడా హింసను నివారించాలని సూచించారు. సత్యం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, ఎల్లప్పుడూ నిజం మాట్లాడాలని మహావీరుడు బోధించారు. నేటి ప్రపంచంలో హింస, అసత్యం, స్వార్థం పెరిగిపోతున్న తరుణంలో మహావీరుని యొక్క బోధనలు మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. మహావీరుడు చూపిన శాంతి, అహింస మార్గం ప్రపంచానికి వెలుగునిచ్చే దివ్వెలాంటిది. మహావీర్ జయంతి సందర్భంగా మనం ఆయన బోధనలను గుర్తుచేసుకోవడమే కాకుండా, వాటిని మన జీవితంలో ఆచరించడానికి ప్రయత్నించాలి. ప్రతి ఒక్కరూ

శాంతియుతమైన, కరుణతో కూడిన జీవితాన్ని గడపడానికి ప్రయత్నిస్తే, సమాజంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించవచ్చు. ఈ మహావీర్ జయంతి సందర్భంగా, మనం మనలో ఉన్న అంతర్లీనమైన శాంతిని వెలిగించుకుందాం. అహింస, సత్యం, కరుణ అనే ఆయన బోధనలను మన జీవితంలో పాటిస్తూ, ఒక మంచి సమాజాన్ని నిర్మించడానికి కృషి చేద్దాం.

## సమర్థ రామదాస్ స్వామి
## (జన్మతిథి, చైత్ర శుద్ధ నవమి, మార్చి 27)



సమర్థగురు రామదాసస్వామి ప్రపంచంలో మహాత్ములైన యోగులలో ఒకరు. మహారాష్ట్రలో జామ్బ్' అనే గోదావరీతట ప్రాంతంలో జన్మించిన వీరు చిన్నతనం నుంచీ శ్రీరామ, శ్రీ ఆంజనేయ భక్తుడు. వివాహ సమయంలో పురోహితుడు ముహూర్త సమయానికి సావధాన'(జాగ్రత్త) అనగానే లేచి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యారు.

గోదావరీతట నాసిక వద్ద శ్రీ సమర్థగురు పన్నెండు సంవత్సరాల కఠోర సాధన చేసారు. ప్రాత:కాలం నుంచి మధ్యాహ్నం వరకు గోదావరి నీళ్ళల్లో నుంచుని గాయత్రీ మంత్రజపం చేసేవారు. శ్రీరామనామజపం శ్రీరామ జయరామ జయజయరామ' మంత్రాన్ని పదమూడుకోట్లసార్లు జపించారు. తర్వాత దేశమంతా తీర్థస్థలాలు పర్యటించారు. పండరీపురంలోనూ ఆయనకు ఆ రాముడే కనిపించాడు. అక్కడే ఆయన భక్త తుకారామ్ ను కూడా కలిసారు. ఆ కాలంలోని దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక దుస్థితి చూసి ఆయనకు చాలా దుఃఖం కలిగింది. సాక్షాత్తు శ్రీరాముడే వీర శివాజీకి సహాయం చేయమని ఆదేశించినట్లు ఆయనకు తోచింది.

సమాజంలో కుల వైషమ్యాలు, ఒక పెద్ద వర్గం అవమానానికి గురై బాధ పడడం చూసి, శ్రీ సమర్థగురు రామదాస్ ఎంతో మనస్తాపం చెందారు. ఈ భేదభావాలను సమూలంగా తొలగించడానికి సమాజాన్ని జాగృతం చేసే పనికి ఉపక్రమించారు. ఇదే విషయాన్ని తమ ప్రఖ్యాత 'దాసబోధ' గ్రంథంలో సైద్ధాంతికంగా తెలియచేస్తూ, పెద్ద- చిన్న, రాజు- పేద, స్త్రీ -పురుష తారతమ్యాలు ఏమీ లేవు, అందరూ ఒకటే, అందరిలోనూ ఒకే పరబ్రహ్మము ఉంటాడు' అని బోధించారు. బ్రాహ్మణుడైనా, శూద్రుడైనా, రాజైనా, ప్రజలైనా, అందరిలోనూ పవిత్రమైన పరబ్రహ్మము ఒక్కటే' అంటూ ఆయన సమస్త మానవులలోనూ ఒకే భగవత్ స్వరూపాన్ని దర్శించి, కుల విభేదాలని తోసిపుచ్చారు. సంత్ చోఖామేలా', వర్కారి సంప్రదాయం'లో (శ్రీ పాండురంగ భక్తి సంప్రదాయం) మహార్' కులానికి చెందిన స్వామీజీ పరమాత్మ గురించి వ్రాస్తూ... అనాథనాథుడైన భగవంతునికి ఏ జాతి లేదు, ఆయన చోఖామేలా'తో కూర్చుని పాలు, పెరుగు భోజనం చేస్తాడు' అన్నారు. మరొకచోట వ్రాస్తూ ఎక్కువ తక్కువ కులాలనే వ్యత్యాసం లేదు. హరినామ సంకీర్తనతో నిండిన అటువంటి వ్యక్తుల పవిత్ర పాదధూళికి నేను నమస్కరిస్తున్నాను' అన్నారు. ఇంకొకరి స్పర్శమాత్రం చేత అపవిత్రమైపోతే నీదేపాటి పవిత్రత? పెద్ద-చిన్న కులభేదాలను తోసిపుచ్చి అందరినీ హృదయపూర్వకంగా ప్రేమించండి, ఆదరించండి; అప్పుడే అందరి హృదయాలు పునీతమౌతాయి' అన్నారు.

చాఫల్ ప్రాంతంలో, భేర్వాడి గ్రామంలోని అంటరానివాళ్ళు' అనబడే దంపతులను, శ్రీ సమర్థగురు రామదాస్ తమ శ్రీరామనవమి ప్రవచనాలకు ఆహ్వానించారు. వారు 'మాండ్' నదిలో స్నానం చేసిన తరువాత, సంప్రదాయానుసారం వారిద్దరికీ చీర-ధోవతులు పెట్టి, సహపంక్తి భోజనం కావించి, దక్షిణ సమర్పించారు. ఆ కాలంలో ఈ సంఘటన ఒక గొప్ప విప్లవంగా పేర్కొనవచ్చని డా. సచ్చిదానంద పర్లికర్ తమ పుస్తకంలో వ్రాసారు. 'కులం, వర్ణం, ప్రాంతం, భాషా భేదాల పేరుతో, మనుషుల మధ్య అంతరాలు శ్రీ సమర్థగురు రామదాస్ గారికి ఎంతమాత్రం అంగీకారం కాదు' అని వ్రాసారు.

ఆ కాలంలో భారతదేశం మీద ఇస్లాంమత దాడులనుంచి దేశాన్ని విముక్తం చేయడానికి శ్రీ సమర్థగురు రామదాస ప్రణాళికాబద్ధంగా కృషి చేసారు. పవిత్ర కృష్ణానది ఉద్భవించిన మహాబలేశ్వర్ కొండలలో ఆయన ప్రథమంగా శ్రీ వీరహనుమాన్ దేవాలయం, మఠం నిర్మించారు; ఆ తరువాత 11 క్షేత్రాల్లో శ్రీ ఆంజనేయ దేవాలయాలు, మఠాలు స్థాపించారు. నెమ్మదిగా శ్రీ సమర్థగురు రామదాస్ మహారాష్ట్ర అంతటా వేయి హనుమాన్ మందిరాలు, అఖాడాలు నిర్మించారు.

ఆ కాలంలో పూర్తి దేశమంతా ముస్లింల చేతిలో హిందువులు ఎన్నో భయంకర దాడులకు, అత్యాచారాలకు గురౌతున్నారు. ఎన్నో ప్రాంతాల్లో రాజ్యాధికారం ముస్లిముల చేతిలోనే ఉంది. భక్తి ఉద్యమంతో పాటు, ముస్లిముల చేతుల్లోంచి అధికారం తిరిగి పొందడం కూడా దైవకార్యంగానే శ్రీ సమర్థగురు రామదాస్ భావించారు. 'స్వరాజ్యం ధర్మకార్యం, పరమేశ్వరుని శిరసు మీద ధరించి, మన దేశాన్ని సర్వనాశనం చేసిన ముస్లిం రాజుల మీద యుద్ధం ప్రకటించండి, దేశం కోసం ప్రాణాలను అర్పించడానికి వెనుకాడకండి' అని శ్రీ సమర్థగురు రామదాస్ పిలుపునిచ్చారు. 'హిందూ ఆలయాలను ధ్వంసం చేసినవారు దైవద్రోహులు, అటువంటివారిని శిక్షించిన వారు దేవదాసులు, ఈశ్వరుని భక్తులు; ఈశ్వర భక్తులకి విజయం తథ్యం'. అని అన్నారు

హిందూ సమాజాన్ని ఐకమత్యంతో ఒక్కతాటిపై తేవడానికి శ్రీ సమర్థగురు రామదాస్, శ్రీరామనవమి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆనాడు జరిగే శ్రీరామ రథోత్సవాలలో, అన్ని కులాలు వర్గాలవారు ఎంతో ఉత్సాహంతో పాల్గొనేవారు.

శ్రీ సమర్థగురు రామదాస్ దేశ వ్యాప్తంగా హిందూ సమాజాన్ని జాగృతం చేసి, ఒక్కతాటిపై సమీకరించడానికి కృషి చేసారు. ఆయన తమ విస్తృత శిష్యపరంపర నుంచి, దాదాపు 1100మందిని 'మహంత్'లుగా తీర్చిదిద్దారు, అందులో 300మంది మహిళలు, ఆనాటి సమాజంలో అది చాలా పెద్ద సంస్కరణ, ముందడుగు. వీరంతా దేశమంతా విస్తరించి, అనేక స్థానాల్లో, హిందూ సమాజాన్ని ఏకీకృతం చేసే పని నిర్వహించారు. వీరు కులాలకి అతీతంగా వేయికి పైగా మఠాల స్థాపన చేసారు. తంజావూరు నుంచి కాశ్మీరు దాకా వ్యాపించిన ఈ మఠాలు, అఖాడాలు, ఛత్రపతి శివాజీ మహారాజుకి ఎంతో సహకారం అందించాయి. శివాజీ మహారాజు పుత్రుడు శ్రీ రాజారాం మహారాష్ట్ర విడిచి దక్షిణ భారతానికి వచ్చినపుడు, తంజావూరు మఠం ఆయనకు సర్వంసహా మద్దతు ఇచ్చినందువల్ల ఆయన ఇరవై సంవత్సరాల పాటు ఔరంగజేబుతో యుద్ధం చేయగలిగారు.

హిందూ సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని శ్రీ సమర్థగురు రామదాస్ అనేక ఉత్కృష్ట రచనలు చేసారు. అందులో ప్రముఖమైనవి- 'దాసబోధ' 'కరుణాష్టక్' 'మనాచే శ్లోక్' 'సుందరకాండ మరియు యుద్ధకాండ'.

వేలాదిమంది కార్యకర్తలను సుశిక్షితులుగా తయారుచేసి, సామాజికంగా సంఘటితం చేయడానికి ఎనలేని కృషి చేసారు. 'అందరి హృదయాలలో శ్రీరాముడు నివాసముంటాడు, కులభేదాలు పట్టుకువేళ్ళాడడం అంటే మనందరిలోని శ్రీరాముడి అస్తిత్వాన్ని నిరాకరంచడమే' అన్నారు. వెనకబడిన కులాలనబడే వారితో పనిచేసి, వారిని సంఘటితం చేసి ఛత్రపతి శివాజీ మహారాజుకి తోడుగా తెచ్చి నిలబెట్టారు.

## జనరల్ కే ఎస్ తిమ్మయ్య (జన్మతిథి, మార్చి 31)



జనరల్ కోదండర సుబ్బయ్య తిమ్మయ్య భారత సైన్యంలో ఒక విశిష్టమైన సైనికుడు. ఇతడు 1957 నుండి 1961 వరకు భారత చైనా దేశాలమధ్య యుద్ధవాతావరణం నెలకొన్న సమయంలో భారత సైన్యంలో ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా కీలకమైన సేవలను అందించాడు. ఇతడు రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్నప్పుడు పదాతిదళానికి నాయకత్వం వహించిన ఏకైక భారతీయుడు. ఇతడు భారత సైన్యం అందించిన ఒక విశిష్ట అధికారిగా గుర్తింపు పొందాడు. కొరియా యుద్ధం తరువాత ఇతడు యుద్ధ ఖైదీలను వారి వారి దేశాలకు తిరిగి పంపే పనిలో ఐక్యరాజ్య సమితి విభాగానికి నాయకత్వం వహించాడు. ఇతడు ఆర్మీ నుండి పదవీ విరమణ చేసిన తరువాత 1964 జూలై నుండి డిసెంబరు 1965 వరకు సైప్రస్ దేశంలో ఐక్యరాజ్యసమితి శాంతి సంరక్షక దళానికి కమాండర్ఇన్‌చీఫ్‌గా నియమించబడ్డాడు. ఇతడు సైప్రస్ లో 18 డిసెంబరు 1965లో మరణించాడు.

జనరల్ తిమ్మయ్య, కర్ణాటక రాష్ట్రం కొడగు జిల్లా (పూర్వపు పేరు కూర్గ్) మద్దికెరి గ్రామంలో 1906, మార్చి 30వ తేదీన తిమ్మయ్య, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వీరి కుటుంబం కాఫీతోటలను పెంచేవారిలో ముందంజలో ఉండేది. ఇతని తల్లి సీతమ్మ మంచి విద్యావంతురాలు, సంఘ సేవకురాలు. ఈమెకు బ్రిటిష్ ప్రభుత్వం కైసర్-ఎ- హింద్ బిరుదును ప్రదానం చేసింది. ఇతడు తమ తల్లిదండ్రుల ఆరుగురు సంతానంలో రెండవవాడు. ఇతని అన్న పొన్నప్ప, ఇతడు, ఇతని తమ్ముడు సోమయ్య ముగ్గురూ భారత సైన్యంలో అధికారులుగా పనిచేశారు. భారతదేశపు మొట్టమొదటి కమాండర్-ఇన్-ఛీఫ్ కె.ఎం.కరియప్ప ఇతని తండ్రివైపు బంధువు. 1935 క్వెట్టా భూకంపం వచ్చినపుడు ఇతని భార్య నీనా తిమ్మయ్య చేసిన సేవా కార్యక్రమానికి ఈమెకు కూడా బ్రిటిష్ ప్రభుత్వం కైసర్-ఎ- హింద్ బిరుదును ప్రదానం చేసింది. ఇతడు మెరుగైన విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో తన 8వ యేటనే తమిళనాడు రాష్ట్రం కూనూరులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో చేరాడు. ఆ తర్వాత బెంగళూరులోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూలులో చదివాడు. ప్రాథమిక విద్య ముగిసిన తరువాత ఇతడు డెహ్రాడూన్ లోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాయల్ ఇండియన్ మిలటరీ కాలేజీ (RIMC) లో చేరాడు. అక్కడి నుండి పట్టా పొందిన తరువాత, జనరల్ తిమ్మయ్య ఇంగ్లాండులోని రాయల్ మిలటరీ కాలేజీకి తదుపరి శిక్షణ కోసం ఎంపిక చేయబడ్డాడు.

మిలటరీ శిక్షణ తరువాత 1926 ఫిబ్రవరి 4న ఇతడిని బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమించారు. ఆ బ్యాచ్‌లో నియమింపబడిన వారిలో ఇతని తరువాత ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేసిన ప్రాణ్ నాథ్ థాపర్ ఉన్నాడు. తిమ్మయ్య 19వ హైదరాబాద్ రెజిమెంట్‌కు చెందిన 4వ బెటాలియన్‌లో 1927 మే 28 న నియమించబడ్డాడు. 1928 మే 4 న ఇతడు లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందాడు.

1935 జనవరిలో ఇతడు నీనా కరియప్పను వివాహం చేసుకున్నాడు. అదే సంవత్సరం ఫిబ్రవరి 4న ఇతడు కెప్టెన్‌గా పదోన్నతి పొందాడు.

రెండవ ప్రపంచయుద్ధం తరువాత ఇతడిని సింగపూర్ బెటాలియన్‌కు బదిలీ చేశారు. తరువాత 1941లో ఇతడిని ఆగ్రాలోని హైదరాబాద్ రెజిమెంటల్ సెంటర్‌లో సెకండ్ - ఇన్ - కామాండ్‌గా నియమించారు. తరువాత ఇతనిని క్వెట్టాలోని స్టాఫ్ కాలేజీలో శిక్షణ కోసం పంపారు. అక్కడ ఇతడు, ఇతని భార్య 1935 క్వెట్టా భూకంప బాధితులకు ఎనలేని సేవలను అందించారు. 1943లో ఇతనికి మేజర్ పదవి లభించింది. ఇతడు 25వ పదాతి దళానికి గ్రేడ్2 స్టాఫ్ ఆఫీసర్‌గా నియమితుడైనాడు. సైన్యంలో ఆ పదవిని వరించిన తొలి భారతీయుడు తిమ్మయ్య.

ఇతని పదాతి దళం అడవులలో యుద్ధశిక్షణను పొంది రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ సేనలను బర్మాలో ఎదుర్కొంది. 1944లో ఇతడు లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొంది బర్మాలో 8వ, 19వ హైదరాబాద్ రెజిమెంట్‌లకు కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేశాడు. 1945లో ఇతడు బ్రిగేడియర్ ర్యాంకుకు ఎదిగాడు. యుద్ధంలో ఇతని సేవలకు గుర్తింపుగా డిస్టింగ్విష్డ్ సర్వీస్ ఆర్డర్ (ఈ.ఐ.ం) ను ప్రకటించారు.

తిమ్మయ్య 1947లో భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత, పాకిస్తాన్ విభజన సందర్భంగా భారత్ పాకిస్తాన్‌ల మధ్య ఆయుధాలు, పనిముట్లు, సైన్యం పంపకాల కమిటీలో సభ్యుడిగా నియమించారు. దాని తరువాత సెప్టెంబర్ 1947లో మేజర్ జనరల్‌గా పదోన్నతి కల్పించి 4వ పదాతి దళానికి కమాండ్‌గా నియమించారు. 1948లో కాశ్మీర్‌లో జరిగిన భారత్-పాక్ యుద్ధంలో ఇతడు క్రియాశీలక పాత్రను నిర్వహించాడు. ఇతడు 19వ పదాతి దళానికి కమాండర్‌గా వ్యవహరిస్తూ కాశ్మీర్ లోయ నుండి పాకిస్తాన్ సేనను తరిమికొట్టాడు.

ఇతని అనుభవాన్ని పరిగణనలో తీసుకుని ఇతడిని ఐకరాజ్యసమితి తటస్థ దేశాల రిపాట్రియేషన్ కమీషన్‌కు ముఖ్యునిగా నియమించి కొరియాకు పంపింది. ఇది చాలా సున్నితమైన, అసాధారణమైన పని అయినప్పటికీ ఇతడు చాకచక్యంతో నెరవేర్చగలిగాడు. ఇతడు స్వదేశానికి తిరిగి వచ్చి లెఫ్టినెంట్ జనరల్ హోదాలో జనరల్ ఆఫీసర్ కమాండింగ్, సదరన్ కమాండ్‌గా 1953లో నియమితుడైనాడు. 1954లో ఇతనికి భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ఇచ్చి సత్కరించింది. ఇతడు భారత ఆర్మీ ఛీఫ్‌గా 1957 మే 7 నుండి బాధ్యతలను చేపట్టాడు. 1959లో అప్పటి కేంద్ర రక్షణ మంత్రి వి. కె. కృష్ణ మేనన్ తో ఏర్పడిన విభేదాల కారణంగా పదవికి రాజీనామా చేశాడు. కానీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ అతని రాజీనామాను తిరస్కరించడంతో పదవిలో కొనసాగాడు. ఇతడు 35 ఏళ్ల మిలటరీ సర్వీసు పూర్తి చేసుకుని 1961 మే 7న పదవీ విరమణ చేశాడు.

భారత సైన్యం నుండి పదవీ విరమణ తరువాత ఐక్యరాజ్యసమితి ఇతని సేవలను మరోసారి ఉపయోగించ తలపెట్టి ఇతడిని సైప్రస్‌లో ఐక్యరాజ్యసమితి సేన(UNFICYP)లకు కమాండర్‌గా జూలై 1964లో నియమించింది. ఇతడు ఆ పదవిలో ఉన్న సమయంలోనే 1965, డిసెంబరు 17 న మరణించాడు. ఇతని స్మృత్యర్థం బెంగళూరు, పూనే, సైప్రస్‌లోని లార్నకా నగరాలలో కొన్ని వీధులకు జనరల్ తిమ్మయ్య రోడ్ అని నామకరణం చేశారు. 1966లో రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ ఇతని స్మారక తపాలాబిళ్ళను విడుదల చేసి గౌరవించింది. బిషప్ కాటన్ బాయ్స్ స్కూలు పూర్వవిద్యార్థులు ఇతని స్మారకార్థం ప్రతి యేటా జనరల్ కె.ఎస్.తిమ్మయ్య స్మారకోపన్యాసాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

## కోదండ రామాలయం, రామతీర్థం క్షేత్రం



పురాతన ఆలయాలు ఎన్నో అద్భుతాలు, ఆవిష్కరణలకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఇలాంటి ప్రతి ఆలయ నిర్మాణం అంతుచిక్కని అపురూప శైలిలో దర్శనమిస్తాయి. ఉత్తరాంధ్రలోని ప్రముఖ క్షేత్రం రామతీర్థం కూడా అందుకు మినహాయింపు కాదు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలో ఉంది రామతీర్థం. రాముడు ఇక్కడ కొంతకాలం వనవాసం చేశాడని, అప్పుడు శివుడి మంత్రం జపించాడని పురాణాల్లో ఉంది. ఈ ఆలయానికి ఉత్తరాన రెండు కిలోమీటర్ల పొడవూ 600 మీటర్లు ఎత్తున్న ఏకశిలా పర్వతం కనిపిస్తుంది.

దీనిపైన సీతారాములు, పాండవులు సంచరించారని చెబుతారు. రామాలయం పక్కనే ఉన్న కోనేరులోని నీరు ఏ కాలంలోనైనా ఇంకిపోవని అంటారు. ఆ నీటి మడుగు నుంచి పశ్చిమం వైపు వెళ్తే భీముని బుర్ర, గాడీ పొయ్యి, బుద్ధ విగ్రహం, పర్ణశాల, పలుకురాయి, పాండవుల పంచలు, సీతమ్మ పురిటి మంచం తాలూకు చిహ్నాలు చూడొచ్చు.

పదహారవ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన పూసపాటి సీతారామచంద్ర మహారాజుకు రాముడు కలలో కనిపించి ద్వాపరయుగంలో పాండవులకు ఇచ్చిన విగ్రహాలు ఇక్కడి బోడికొండపైన ఉన్న నీటి మడుగులో ఉన్నట్లు చెప్పాడట. ఆ రాజు విగ్రహాలను వెలికితీయించి ఆలయం నిర్మించాడట. తీర్థంలో దొరికిన విగ్రహాలు కావడం వల్లే ఈ క్షేత్రానికి రామతీర్థం అనే పేరు వచ్చిందని, ఇది అతిపురాతనమైన దేవాలయంగానే కాక.. మరో భద్రాద్రిగానూ గుర్తింపు పొందిందనీ చరిత్ర చెబుతోంది. రాముడు, ఆంజనేయస్వామి అడుగులుగా భావించే పాద ముద్రికలు ఈ కొండపై ఇప్పటికీ కనిపిస్తాయి. ఈ ప్రాంగణానికి ఉత్తరాన నీలాచలం, పశ్చిమాన జైన మందిరం ఉంది. రాతినిర్మిత కట్టడాలు చూపరుల మనసును దోచేలా దర్శనమిస్తాయి.

ఇక్కడ ఉండే ఇతర ఉపాలయాల్లో వైకుంఠనాథస్వామి, వేణుగోపాలస్వామి, లక్ష్మీదేవి, మాధవస్వామి, వరాహలక్ష్మి, నరసింహస్వామి, ఆంజనేయస్వామి, ఆళ్వారుల సన్నిధి, ఉమా సదాశివస్వామిలను దర్శించుకోవచ్చు. అలాగే, రామతీర్థం చూసేందుకు వచ్చే భక్తులు తప్పకుండా భీముని గృహాన్ని కూడా సందర్శించొచ్చు. అంతేకాదు, ఈ ప్రాంతంలో జైనులు కూడా నివసించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇక్కడి కొండల్లోని గురుభక్తకొండ, దుర్గకొండ అనే కొండలపై ప్రాచీనమైన బౌద్ధాలయాలు ఉన్నట్టుగా, వాటికి చారిత్రక ప్రాధాన్యం ఉందని చరిత్రకారులు పేర్కొన్నారు.

ఈ క్షేత్రంలో సంవత్సరం పొడవునా ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. మాఘశుద్ధ ఏకాదశి రోజున రాముడికి కల్యాణం నిర్వహించి పౌర్ణమి వరకూ ఉత్సవాలు చేస్తారు. ఆ సమయంలో సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను రోజుకొక వాహనంపై పురవీధుల్లో ఊరేగిస్తారు. అలాగే, దసరా సమయంలో పదిరోజుల పాటు వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఉంటాయి. విజయదశమి నాడు స్వామి అశ్వవాహనంపైన నీలాచలం వద్దకు చేరి జమ్మి వృక్ష పూజ, ఆయుధ పూజ నిర్వహించడం కన్నుల పండుగగా ఉంటుంది. ఈ ఆలయంలో ఏడాదికోసారి జ్యేష్ఠాభిషేకాలూ నిర్వహించి, స్వామికి సహస్ర ఘటాభిషేకం చేస్తారు. ఆ రోజున రాముడి నిజరూపాన్ని భక్తులు దర్శించుకోవచ్చు. ధనుర్మాసంలోనూ నెలరోజులు విశేష పూజలు జరుగుతాయి. రామతీర్థాన్ని శివక్షేత్రంగానూ భావించే భక్తులు మహాశివరాత్రి రోజున ఇక్కడ వైభవంగా జరిగే జాతరను చూసేందుకు సుదూర ప్రాంతాలనుంచి వస్తుంటారు.

రామతీర్థం విజయనగరం జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. రైలు మార్గంలో చేరుకునేవారు విజయనగరం రైల్వేస్టేషన్ లో దిగాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఆటోలు, బస్సుల్లో రామతీర్థం చేరుకోవచ్చు. అదేవిధంగా దూర ప్రాంతాల నుంచి జాతీయ రహదారిపై వచ్చేవారు శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో దిగాల్సి ఉంటుంది. అక్కడి నుంచి బస్సులు తిరుగుతాయి. విమానాల్లో వచ్చేవారు విశాఖలో దిగి అక్కడి నుంచి విజయనగరం వెళ్లాల్సి ఉంటుంది.

## మార్చి 1922 లో జరిగిన మన్యం పోరాటం



భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో వనవాసీల పాత్రను ప్రతిబింబించిన గొప్ప ఉద్యమాలలో ఒకటి మన్యం పోరాటం. ఇది 1922 మార్చ్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు ఘాట్ అడవి ప్రాంతాల్లో ప్రారంభమైంది. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన మహానేత అల్లూరి సీతారామ రాజు వనవాసీల హక్కుల కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటును నడిపారు. ఈ ఉద్యమం 1922 నుండి 1924 వరకు కొనసాగి, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రత్యేక స్థానం సంపాదించింది.

బ్రిటిష్ పాలనలో వనవాసీల జీవన విధానం తీవ్రంగా దెబ్బతింది. ముఖ్యంగా 1882లో అమలులోకి వచ్చిన మద్రాస్ ఫారెస్ట్ చట్టం ద్వారా వనవాసీలకు అడవుల్లో స్వేచ్ఛగా వేటాడటం, మట్టిపోలం సాగు (పోడు వ్యవసాయం) చేయడం, వనరులను వినియోగించడం నిషేధించబడింది. అదనంగా, “బెగార్” అనే బలవంతపు కూలీ విధానం అమలు చేయబడింది. ఈ చట్టాలు వనవాసీల ఆర్థిక, సామాజిక పరిస్థితులను దిగజార్చాయి. ఫలితంగా వీరికి బ్రిటిష్ అధికారులపై తీవ్ర అసంతృప్తి ఏర్పడింది.

అల్లూరి సీతారామ రాజు యువకుడిగానే వనవాసీల ప్రాంతాల్లో సంచరిస్తూ వారి కష్టాలను తెలుసుకున్నారు. ఆయన వనవాసీల విశ్వాసాన్ని గెలుచుకొని, వారిని సంఘటితం చేశారు. ధైర్యం, ఆత్మవిశ్వాసం, త్యాగస్ఫూర్తితో ఆయన

గెరిల్లా యుద్ధ విధానాన్ని అనుసరించి పోరాటాన్ని నడిపించారు. ఆయుధాలు సంపాదించడానికి పోలీస్ స్టేషన్లపై దాడులు చేయాలని ప్రణాళిక రచించారు.

1922 మార్చ్ నెలలో మన్యం ప్రాంతాల్లో బ్రిటిష్ పోలీస్ స్టేషన్లపై దాడులు ప్రారంభమయ్యాయి. చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి వంటి ప్రాంతాల్లో దాడులు చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని కుదిపేశాయి. వనవాసీల రాజు నాయకత్వంలో సమర్థంగా పోరాడారు.

మన్యం పోరాటం గెరిల్లా యుద్ధ రూపంలో సాగింది. అడవులను ఆధారంగా చేసుకుని రాత్రివేళ దాడులు చేసి, పగలు దాగేవారు. ఈ విధానం బ్రిటిష్ సైన్యానికి పెద్ద సవాలుగా మారింది. బ్రిటిష్ ప్రభుత్వం ప్రత్యేక దళాలను పంపి కఠిన చర్యలు తీసుకుంది. గ్రామాలపై దాడులు చేసి వనవాసీలను హింసించింది.

1924లో బ్రిటిష్ సైన్యం అల్లూరి సీతారామ రాజును పట్టుకొని కాల్చిచంపింది. ఆయన మరణంతో పోరాటం ముగిసినా, వనవాసీల స్వాభిమానాన్ని, స్వాతంత్ర్యాసక్తిని ప్రపంచానికి తెలియజేసింది.

మన్యం పోరాటం వనవాసీల హక్కుల కోసం జరిగిన మహత్తర ఉద్యమం. ఇది భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ప్రేరణగా నిలిచింది. అల్లూరి సీతారామ రాజు “మన్యం వీరుడు”గా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ఈ పోరాటం ద్వారా వనవాసీల సమస్యలు దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి.

1922 మార్చ్‌లో ప్రారంభమైన మన్యం పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక విశిష్ట ఘట్టం. వనవాసీల ఆత్మగౌరవం, స్వేచ్ఛాస్ఫూర్తి, త్యాగం ఈ ఉద్యమంలో స్పష్టంగా ప్రతిఫలించాయి. అల్లూరి సీతారామ రాజు త్యాగం భారత చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది.

## ఔరంగజేబు దండయాత్రను ప్రతిఘటిస్తూ సాగిన మరాఠా పోరాటాలు (సా. శ. 1681 - 1707)



1681 నుండి 1707 వరకు ఔరంగజేబ్‌కు వ్యతిరేకంగా జరిగిన మరాఠాల పోరాటం భారత చరిత్రలో అత్యంత దీర్ఘకాలిక, వ్యూహాత్మక మరియు గెరిల్లా యుద్ధాలకు ప్రసిద్ధి చెందిన ఘట్టం. ఇది కేవలం రాజ్య విస్తరణ కోసం కాదు – స్వరాజ్య రక్షణ, హైందవ ధర్మ పరిరక్షణ, స్థానిక పరిపాలనా స్వాతంత్ర్యం కోసం సాగిన సమగ్ర ఉద్యమం.

మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ (1674లో పట్టాభిషేకం) తర్వాత, ఆయన మరణం (1680) తో మరాఠా రాజ్యం బలహీనమవుతుందని భావించి ఔరంగజేబ్, స్వయంగా దక్షిణ భారతదేశం పైకి దండయాత్రకు దిగాడు (1681). ఆయన లక్ష్యం మరాఠా శక్తిని పూర్తిగా నశింపజేయడం, దక్కన్ సుల్తానతులను (బీజాపూర్, గోల్కొండ) స్వాధీనం చేసుకోవడం మరియు ముఘల్ సామ్రాజ్యాన్ని దక్షిణానికి విస్తరించడం.

శివాజీ కుమారుడు శంభాజీ మహారాజ్ ఈ కుటిల యత్నాలను తీవ్రంగా ప్రతిఘటించాడు. తన యుద్ధ నీతిలో భాగంగా, శంభాజీ గోల్కొండ, బీజాపూర్‌లతో మైత్రి ప్రయత్నాలు చేస్తూ ముఘల్ సైన్యాలపై దాడులు చేశాడు. ఇందుకు గెరిల్లా యుద్ధ పద్ధతుల కొనసాగింపును మార్గంగా ఎంచుకున్నాడు.

1689లో శంభాజీ పట్టుబడి, ఔరంగజేబ్ ఆదేశాలపై అత్యంత క్రూరంగా హతమార్చబడ్డాడు. ఇది మరాఠాలకు తీవ్ర దెబ్బ అయినప్పటికీ పోరాటం ఆగలేదు.

శంభాజీ మరణం తరువాత ఛత్రపతి శివాజీ మరో కుమారుడు రాజారాం సింహాసనం అధిష్ఠించాడు. ఆయన దక్షిణ భారతదేశంలోని జింజీ కోటకు చేరుకుని, అక్కడి నుంచి పోరాటం కొనసాగించాడు. ముఘల్ సైన్యం 8 సంవత్సరాలు (1690--1698) జింజీ కోటను ముట్టడించింది. మరాఠా సేనాధిపతులు – సంతాజీ ఘోర్పడే, ధనాజీ జాధవ్ గెరిల్లా దాడులతో ముఘల్ సరఫరా మార్గాలను దెబ్బతీశారు. ఇది “హిట్ అండ్ రన్” వ్యూహానికి అద్భుత ఉదాహరణ.

రాజారాం మరణం (1700) తర్వాత ఆయన భార్య తారాబాయి నాయకత్వం (1700--1707) చేపట్టింది. ఈమె స్వయంగా యుద్ధ వ్యూహాలు రూపొందించింది. మరాఠా సైన్యాన్ని ఐక్యంగా ఉంచి, ముఘల్ ప్రాంతాలపై దాడులు చేసి ఆర్థిక నష్టం కలిగించింది. తారాబాయి నాయకత్వం మరాఠా ఉద్యమానికి మళ్లీ ఉత్సాహం ఇచ్చింది.

ఛత్రపతి శివాజీ మహారాజ్ మరణం తరువాత మారాఠాలకు నాయకత్వం వహించిన పై వారందరూ కూడా గెరిల్లా యుద్ధ పద్ధతినే అనుసరించి, చిన్న దళాలుగా రాత్రిపూట దాడులు చేయడం, పర్వత ప్రాంతాల వినియోగం విస్తృతంగా చేసుకుంటూ ముఘల్ సైన్యం సరఫరా మార్గాలను లక్ష్యంగా చేసుకుని ప్రతిఘటించడం చేశారు. అలాగే మారాఠాలు తమ యుద్ధ యంత్రాంగంలో భాగంగా, సహ్యాద్రి పర్వతాలలో కోటల నిర్మాణం చేబట్టారు. యుద్ధంలో ఒక కోట కోల్పోతే మరొకదానిలో నుంచి దాడిచేయడం వీరి యుద్ధనీతిలో భాగం. తమ ఆర్థిక వనరులను పెంపొందించేదుకు చౌత్, సర్దేశ్ముఖీ రూపాన పన్ను వసూళ్లు చేసుకుంటూ ముఘల్ ఆదాయ వ్యవస్థను కుదేలు చేశారు.

మారాఠాలతో దీర్ఘకాలిక యుద్ధం వల్ల ముఘలుల ఖజానా ఖాళీ అవడమే కాక, సైన్యం తీవ్రంగా అలసటకు లోనైనది. దీనికి తోడు ముఘలులకు దక్షిణ భారత భౌగోళిక పరిస్థితుల అవగాహన లోపం తోడవడంతో పలాయనం చిత్తగించారు. 1707లో ఔరంగజేబ్ మరణించాడు. కానీ మరాఠా శక్తి మాత్రం నిరుపమానంగా కొనసాగి, 18వ శతాబ్దంలో ఉత్తర భారతదేశం వరకు విస్తరించింది.

1681--1707 మరాఠా పోరాటం కేవలం రాజ్యాల మధ్య యుద్ధం కాదు, స్థానిక స్వాతంత్ర్య ఉద్యమానికి ఆది, గెరిల్లా యుద్ధానికి గొప్ప ఉదాహరణ, ముఘల్ సామ్రాజ్య పతనానికి ప్రారంభ బిందువు. మారాఠాల పోరాటాలతో ఔరంగజేబ్ దక్షిణంలో గెలవలేక, ముఘల్ సామ్రాజ్యాం బలహీనపడింది.

## ఆంధ్రలో మితిమీరిన మతమార్పిడులు



గత రెండు దశాబ్దాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సువార్తిక క్రైస్తవ మతమార్పిడులు విపరీతంగా పెరిగాయని స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో తీవ్రమైన మరియు ఆందోళనకరంగా పెద్ద ఎత్తున మతమార్పిడులు జరిగాయి. దీనివల్ల సామాజిక కలహాలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తడంతోపాటు కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. గత రెండు దశాబ్దాలుగా, అన్ని జిల్లాలు, పట్టణాలు మరియు మండలాల్లో ఎక్కువ మందితో మతమార్పిడులను ఆకర్షించడానికి భారీ సమ్మేళనాలు నిర్భయంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సమ్మేళనాలలోని వక్తలు భారతీయ మతాలు మరియు సంస్కృతికి వ్యతిరేకంగా మాట్లాడి, సన్నిహిత గ్రామీణ సమాజాలలో మత విద్వేషానికి బీజాలు నాటుతున్నారు. కొత్తగా మతమార్పిడులు చెందుతున్న వారు తమ మరణించిన పెద్దలను దహనం చేయడానికి నిరాకరిస్తున్నారు, కుటుంబ వేడుకలకు హాజరు కావడానికి కూడా వెనుకాడుతున్నారు.

టీవీ చర్చల ద్వారా దూకుడుగా మతమార్పిడి చేసే సువార్తికులు, మతం మారిన వారి మనస్సులలో వేర్పాటువాద ఆలోచనల విత్తనాలను నాటుతున్నారని కలవరపెట్టే ఆధారాలు తెరపైకి వచ్చాయి. మతం మారిన వారి విశ్వాసాలు దేశం నుండి విదేశాలలో ఉన్న భూభాగేతర, రాజ్యాంగేతర సువార్తిక/క్రైస్తవ మత పెద్దలకు మారుతున్నాయి. ఇది దేశ ఐక్యత మరియు సమగ్రతను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక మతం నుండి మరొక మతానికి మారడాన్ని నియంత్రించడానికి లేదా పర్యవేక్షించడానికి ఎటువంటి చట్టం లేదు. మతం మారడాన్ని నమోదు చేయడానికి ఎలాంటి తప్పనిసరి నిబంధన లేనందున, హిందూ మతం నుండి క్రైస్తవ మతంలోకి జరిగే మార్పిడులు చాలావరకు గుర్తించబడవు లేదా ఏ అధికారిక రికార్డులలో నమోదు చేయబడవు. రాష్ట్రంలో ఎస్సీ హిందూ జనాభాకు చెందినవారు ఎక్కువగా ఉన్నారు. 'ఎస్సీ' మరియు 'క్రిస్టియన్' అనే పదాలను పరస్పరం మార్చుకుని దోపిడీకి గురిచేస్తున్నారనే వాస్తవం ద్వారా సమస్య యొక్క తీవ్రతను అంచనా వేయవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవ జనాభా గురించి క్రైస్తవ పాస్టర్లు తమ సొంత వాదనలు చెబుతున్నారు – ఇటీవలి సంవత్సరాలలో, టీవీ చర్చలలో అనేక మంది క్రైస్తవ నాయకులు రాష్ట్ర జనాభాలో దాదాపు 30% మంది ఇప్పుడు క్రైస్తవులు అని చెబుతున్నారు, దీని వలన జనాభాలో 28.5% మంది జనాభా లెక్కల సమయంలో తమ మతాన్ని తప్పుగా ప్రకటించుకున్నారని మరియు ఈ తప్పుడు ప్రకటనలలో ఎక్కువ భాగం హిందూ మతం నుండి క్రైస్తవ మతంలోకి మారిన SC/OBC లు చేశారని తప్పించుకోలేని నిర్ధారణకు వచ్చారు. ఇది చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించడం మరియు భారత రాజ్యాంగ స్ఫూర్తిని అవహేళన చేయడమే అవుతుంది.

క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్న వారు హిందూ–ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలను పొందారని, ఎస్సీల ప్రయోజనాల కోసం ఇవ్వబడిన అన్ని అవకాశాలు, సౌకర్యాలు మరియు పథకాలను పొందారని – ఎన్నికల నియోజకవర్గాలలో రిజర్వేషన్లు, రాజకీయ మరియు నామినేటెడ్ పదవులు, ఉద్యోగాలు, విద్యావకాశాలు, స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లు, గృహనిర్మాణం వంటి వాటిని పొందుతున్నారని వేరే చెప్పనక్కరలేదు.

2011 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తంలో క్రైస్తవుల సంఖ్య 6,82,660. 1951 నుండి 2011 జనాభా లెక్కల వరకు, క్రైస్తవుల శాతం 5.37% నుండి 1.38%కి పడిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా చర్చిలు/సువార్త కార్యకలాపాల సంఖ్య చూస్తే నివ్వెరపోయే పెరుగుదల కనిపిస్తోంది. అంటే, రాజ్యాంగబద్ధంగా హామీ ఇవ్వబడిన రిజర్వేషన్లు/రక్షణలను హిందూ SC/OBC నుండి మతం మారిన క్రైస్తవ మతమార్పిడిదారులు దుర్వినియోగం చేస్తున్నారని ఋజువవుతోంది కదా!

గమనించదగ్గ విషయం ఏమిటంటే, హిందూ మతం నుండి క్రైస్తవ మతంలోకి మారిన వారిలో ఎక్కువ మంది SC/OBC వంటి హిందూ కుల ధృవీకరణ పత్రాలను పొందుతూ రిజర్వేషన్ల ప్రయోజనాలన్నింటినీ పొందుతున్నారు. హిందూ మతాన్ని మరియు సాంప్రదాయ/పూర్వీకుల జీవన విధానాన్ని మరియు సాంస్కృతిక పద్ధతులను ఇప్పటికీ నమ్మకంగా ఆచరిస్తున్న నిజమైన హిందువులు వారి సామాజిక మరియు ఆర్థిక అభ్యున్నతి కోసం వారి చట్టబద్ధమైన రాజ్యాంగబద్ధంగా హామీ ఇవ్వబడిన ప్రయోజనాలను పూర్తిగా కోల్పోతున్నారు. ఇది ఖ్రి లకు రాజ్యాంగం మంజూరు చేసిన ప్రత్యేక సౌకర్యాలను తీవ్రంగా దుర్వినియోగం చేయడమే అవుతున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హిందూ కుల ధృవీకరణ పత్రాలు కలిగి ఉన్న మతం మారిన క్రైస్తవులకు రిజర్వేషన్లు మరియు ఇతర ప్రయోజనాలను పొందుతున్న వారి గురించి సరైన జనాభా గణన జరిగితే, భారీ మొత్తంలో కుంభకోణం బయటపడుతుంది. ఈ డేటాను ప్రజల సంఖ్య, దుర్వినియోగం చేయబడిన నిధులు మరియు ఈ మోసం కొనసాగిన దశాబ్దాల భారీ కాలపరిమాణానికి లెక్కకట్టినట్లైతే, ఇది భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అతిపెద్ద నేరంగా పరిగణించవచ్చు. ఈ భారీ మతమార్పిడి పరిణామాలు, నిజమైన మరియు అర్హులైన ఎస్సీలకు వ్యతిరేకంగా జరిగిన కుట్రను వెల్లడిస్తాయి. వాస్తవానికి భారతదేశ స్వాతంత్ర్యానంతరం జరిగిన పెను కుంభకోణంగా ఈ మతమార్పిడులను పేర్కొనవచ్చు.

## ద్వారకా తిరుమలలో జరిగే కుంకుళ్ళమ్మ వసంత నవరాత్రి జాతర



ఆంధ్రప్రదేశ్‌లోని ద్వారకా తిరుమల ప్రాంతం ప్రధానంగా శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంగా ప్రసిద్ధి పొందినప్పటికీ, అక్కడి గ్రామదేవత అయిన కుంకుళ్లమ్మ అమ్మవారి వసంత నవరాత్రి జాతర స్థానిక ప్రజల ఆధ్యాత్మిక,సాంస్కృతిక జీవితంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఈ జాతర కేవలం ఒక మతపరమైన ఉత్సవం మాత్రమే కాదు; ఇది గ్రామీణ సమాజ నిర్మాణం, విశ్వాస వ్యవస్థ, ఆర్థిక పురోగతి, మరియు సాంస్కృతిక ఐక్యతలను ప్రతిబింబించే సమగ్ర సామాజిక ప్రక్రియ.

గ్రామ దేవత ఆరాధన దక్షిణ భారతదేశంలో ప్రాచీన సంప్రదాయంగా కొనసాగుతోంది. కుంకుళ్లమ్మను గ్రామ రక్షక శక్తిగా భావించడం, వ్యవసాయ ఆధారిత జీవన విధానంలో సహజమైన అభివృద్ధి, ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు, పంటల అనిశ్చితి వంటి అంశాల నుంచి రక్షణ కోసం ప్రజలు ఒక మాతృరూపాన్ని ఆశ్రయించడం సామాజిక––మానసిక అవసరంగా రూపుదిద్దుకుంది. వసంత కాలంలో జరిగే ఈ నవరాత్రి ఉత్సవం ప్రకృతి పునరుద్ధరణకు సంకేతంగా నిలుస్తుంది.

నవరాత్రులు శక్తి ఆరాధనకు చిహ్నం. తొమ్మిది రోజుల పాటు జరిగే పూజలు శక్తి యొక్క విభిన్న రూపాలను సూచిస్తాయి. చండీ హోమం, కలశ స్థాపన, ప్రత్యేక అలంకరణలు వంటి ఆచారాలు చెడు శక్తుల నిర్మూలన మరియు శుభశక్తి ఆవాహనకు ప్రతీకలుగా భావించబడతాయి.

వసంతం పునర్జన్మను సూచిస్తే, నవరాత్రి ఆత్మపరిశుద్ధి మరియు నూతన ఆరంభానికి సంకేతం. అందువల్ల ఈ జాతర భక్తిలోని భావోద్వేగాన్ని మాత్రమే కాకుండా జీవన తాత్వికతను కూడా ప్రతిబింబిస్తుంది.

జాతర సమయంలో గ్రామస్థులు అందరూ కలిసి వేడుక ఏర్పాట్లు చేయడం సామూహిక ఐక్యతను బలోపేతం చేస్తుంది. పలు చోట్లకు వలస వెళ్లిన వారు కూడా ఈ సందర్భంలో గ్రామానికి చేరుకోవడం కుటుంబ--సామాజిక బంధాలను పునరుద్ధరిస్తుంది. అన్నదానం వంటి కార్యక్రమాలు సమానత్వ భావనను పెంపొందిస్తాయి.

ఈ జాతరలో మహిళల పాత్ర విశేషం. కుంకుమార్చనలు, దీపారాధనలు వంటి పూజా కార్యక్రమాలలో మహిళలు ప్రధానంగా పాల్గొనడం గ్రామీణ సమాజంలో స్త్రీ శక్తికి ఇచ్చే గౌరవాన్ని తెలియజేస్తుంది.

ద్వారకా తిరుమలలో ప్రధాన దేవాలయం వైష్ణవ సంప్రదాయానికి చెందినప్పటికీ, కుంకుళ్లమ్మ జాతర స్థానిక జానపద విశ్వాసాలపై ఆధారపడింది. ఇది శాస్త్రోక్త పద్ధతుల కంటే భావోద్వేగ భక్తికి ప్రాధాన్యం ఇచ్చే ఉత్సవ రూపం.

జాతర సమయంలో తాత్కాలిక మార్కెట్లు, చిన్న వ్యాపారాలు ఏర్పడి స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. జానపద కళలు, భక్తి గేయాలు, ఊరేగింపులు వంటి సాంస్కృతిక అంశాలు స్థానిక సంప్రదాయాలను సజీవంగా ఉంచుతాయి. ఈ విధంగా జాతర ఒక సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ వేదికగా నిలుస్తుంది.

కాలానుగుణంగా విద్యుత్ అలంకరణలు, ధ్వని వ్యవస్థలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం వంటి మార్పులు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ, జాతర యొక్క మూల స్ఫూర్తి, గ్రామ రక్షక దేవతపై విశ్వాసం అదే విధంగా కొనసాగుతోంది. ఇది సంప్రదాయం మరియు ఆధునికత మధ్య సమతుల్యతను సూచిస్తుంది.

ద్వారకా తిరుమల కుంకుళ్లమ్మ వసంత నవరాత్రి జాతర ఒక ఆధ్యాత్మిక ఉత్సవం మాత్రమే కాదు; ఇది గ్రామీణ సమాజ నిర్మాణం, స్త్రీ శక్తి ఆరాధన, సామూహిక ఐక్యత, ఆర్థిక చలనం, మరియు సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. శాస్త్రీయ, సాంస్కృతిక కోణంలో పరిశీలించినప్పుడు, ఈ జాతర గ్రామీణ భారతీయ జీవన విధానాన్ని అర్థం చేసుకునే సమగ్ర అధ్యయన అంశంగా చెప్పవచ్చు.

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి
research@csisindia.com

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact
research@csisindia.com
Contact : +917075881925

## "డీకలోనైజ్ టు రిక్లెయిమ్ ది సెల్ఫ్‌హుడ్" జాతీయ సదస్సు - సంక్షిప్త నివేదిక

సెంటర్ ఫర్ సౌత్ ఇండియన్ స్టడీస్ (CSIS) మరియు Indian Council of Historical Research సంయుక్త ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో తిరువనంతపురంలోని Chinmaya Institute of Management and Technology లో "డీకలోనైజ్ టు రిక్లెయిమ్ ది సెల్ఫ్‌హుడ్" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించబడింది.

సదస్సును ముఖ్య అతిథి శ్రీ ఆర్. హరికుమార్ ప్రారంభించి, డీకలోనైజేషన్ అవసరాన్ని ప్రస్తావించారు. అధ్యక్ష ప్రసంగం ప్రొఫెసర్ ఎం.వి. నటేశన్ గారు, ప్రధానోపన్యాసం ప్రొఫెసర్ ఎం. శ్రీనాథన్ గారు అందించారు. జపాన్‌లోని Takushoku University కు చెందిన ప్రొ. కియోషి కవహారా గారు గౌరవ అతిథిగా పాల్గొన్నారు.



మొదటి రోజు ప్రొఫెసర్ కే కే మహమ్మద్ "భారతీయ నాగరికత పున:ఆవిష్కరణ" అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. దక్షిణ భారతదేశంలో వలసవాద వ్యతిరేక పోరాటాలు, వలస పాలనలో సాంస్కృతిక, బౌద్ధిక ప్రతిఘటన వంటి అంశాలపై పలు సాంకేతిక రూపకాలు నిర్వహించబడ్డాయి. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమం జరిగింది.

రెండవ రోజు డీకలోనైజేషన్ అధ్యయనాల అంశాలు, రూపురేఖలు, మరచిపోయిన వీరులు మరియు ఉద్యమాలు, వలస చరిత్ర, రచనల ప్రభావం వంటి విషయాలపై చర్చలు జరిగాయి.

సదస్సు ముగింపు కార్యక్రమంలో కేరళ గవర్నర్ శ్రీ రాజేంద్ర విశ్వనాథ ఆర్లెకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, డీకలోనైజేషన్ ఆలోచనల ప్రాముఖ్యతను వివరించారు. తదనంతరం పుస్తకావిష్కరణలు, సత్కారాలు, సర్టిఫికెట్‌ను పంపిణీ జరిగాయి. జాతీయ గీతంతో సదస్సు విజయవంతంగా ముగిసింది.

### ఈ నెలలో ముఖ్యమైన రోజులు:

1. హోళీ పండుగ, మార్చి 3
2. ఉగాది, హిందూ సంవత్సరాది, వసంత నవరాత్రుల ప్రారంభం, మార్చి 19
3. శ్రీరామనవమి, మార్చి 27

